సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.21

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.21, కనిష్టంగా రూ.14 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,375 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.8°/21.3°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

మద్యం బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఐదు మద్యం బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, ఏఈఎస్ నరసింహులు తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, ధర్మవరం మున్సిపాలిటీ రెండు, కదిరి మున్సిపాలిటీ, మడకశిర నగర పంచాయతీ పరిధిలో ఒకటి చొప్పున బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. 2025 సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31 వరకు బార్లు నిర్వహించుకునేందుకు వీలుగా లైసెన్సులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు పుట్టపర్తి ఉజ్వల ఫౌండేషన్ విల్లాలో ఉన్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో ఈనెల 14వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు నేరుగా దరఖాస్తులు అందజేయాలన్నారు. లేదా ఆన్‌లైన్‌కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు రూ. 5 లక్షల డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు రూ.10 వేలు (ప్రాసెసింగ్ ఫీజు) చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక బార్‌కు ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. 15వ తేదీ ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ ద్వారా బార్లను కేటాయిస్తామన్నారు. బార్లు దక్కించుకున్న వారు లైసెన్స్ ఫీజును ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చన్నారు.

బలవంతపు భూ సేకరణ ఆపాలి



వైబీహళ్లిలో రైతులతో కలిసి నినాదాలు చేస్తున్న రైతు సంఘం నాయకులు

మడకశిర రూరల్: బలవంతపు భూసేకరణతో రైతుల పొట్టకొట్టవద్దని ఏపీ రైతు సంఘం నాయకులు అధికారులను వేడుకున్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో సోలార్ ప్రాజెక్టు కోసం రైతుల నుంచి ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం రైతు సంఘం నాయకులు వైబీ హళ్లి, సీ కొడిగేపల్లి పంచాయతీల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. సారవంతమైన భూములను సేకరించడాన్ని నిరసిస్తూ రైతులతో కలిసి వైబీహళ్లిలో సోలార్ ప్రాజెక్టు వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరి, కార్యదర్శి పెద్దన్న, ఉపాధ్యక్షుడు రామకృష్ణ తదితరులు మాట్లాడారు. రైతుల ఆమోదం లేకపోతే భూ సేకరణ చేయకూడదని 2013 భూ సేకరణ చట్టం చెబుతోందన్నారు. ఎకరాకు రూ.30 వేల ప్రకారం 30 ఏళ్ల అగ్రిమెంట్ చేసుకోవడం ద్వారా రైతులు భూ హక్కును కూడా ప్రమాదం ఉంటుందన్నారు. సీ కొడిగేపల్లి పంచాయతీలో సేకరించిన భూముల్లో ఇప్పటి వరకు సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనందున ఆ భూములను తిరిగి రైతులకు కేటాయించాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు దశల వారీగా పోరాటం చేస్తామన్నారు.

ఆధిపత్య పోరులో ఆటబొమ్మలు

ఎంపీలను లెక్కచేయని శాసనసభ్యులు

- అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలూ చేపట్టకూడదని హుకుం
- ఇటీవల ఎంపీ అంబికాతో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ఢీ
- శింగనమలలో ఎంపీపై టీడీపీ కార్యకర్తల తిరుగుబాటు
- పెనుకొండలో మరీ ఘోరంగా ఎంపీ పార్థసారథి పరిస్థితి
- ఆవేదనలో ఎంపీల అనుచరులు
- టీటీడీ లెటర్లకు తప్ప ఎందుకూ ఉపయోగపడటం లేదని నిట్టూర్పు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఇప్పటికే రోజుకో నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు, కింది స్థాయి కేడర్‌కు మధ్య రచ్చ జరుగుతూనే ఉంది. ఇప్పుడు ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య పోరు పతాక స్థాయికి చేరినట్లు తెలిసింది. ఏ నియోజకవర్గంలో అయినా సరే ఎంపీ మాట నెగ్గే పరిస్థితి లేదు. ఒకవిధంగా చెప్పాలంటే ఎంపీలు డమ్మీలుగా మారారని, ఎప్పుడూ ఈ పరిస్థితి లేదని టీడీపీ నాయకులే పెదవి విరుస్తున్నారు. టీటీడీ లెటర్లు ఇవ్వడానికి మినహా దేనికీ పనికిరావడం లేదంటున్నారు.

మా అనుమతి లేనిదే..

ఎలాంటి అనధికార కార్యక్రమాలకూ తమకు తెలియకుండా ఎంపీలు వెళ్లడానికి వీల్లేదంటూ ఎమ్మెల్యేలు హుకుం జారీచేశారు. తాజాగా అనంతపురం అర్బన్‌లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాతూరు మార్కెట్ పరిశీలనకు వెళ్లినప్పుడు ఎమ్మెల్యేకు, ఎంపీకి తీవ్ర వాగ్వాదం జరిగింది. 'నా అనుమతి లేకుండా వెళ్లడానికి మీరెవరు' అంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి విరుచుకుపడినట్టు తెలిసింది. తాడిపత్రి, గుంతకల్లు, ధర్మవరం, కదిరి వంటి నియోజకవర్గాలు ఎలా ఉన్నాయో కూడా ఎంపీలకు తెలియదు! నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టులు కానీ, కేటాయింపులు చేసే అధికారాలు కూడా ఎంపీలకు లేవు. ఏ నియోజకవర్గంలో అయినా ఎమ్మెల్యేలే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. ఇసుక, మట్టి, మద్యం ఇలా ఏదైనా కానీ ఎంపీలకు దక్కడానికి వీల్లేకుండా చేశారు. 'పేరుకే ఎంపీ.. అంతా ఎంప్టీ' అన్న చందాన తయారైంది పరిస్థితి. ఇటీవల శింగనమల నియోజకవర్గంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తమకొద్దంటూ టీడీపీ కార్యకర్తలే ధర్నా చేయడం సర్వత్రా చర్చకు దారి తీసింది.

ఆయనకు అడుగడుగునా..

హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. చివరి నిమిషంలో ఇచ్చింది చాలు అన్నట్టు ఎంపీ సీటు దక్కించుకుని గెలిచినా.. ఉమ్మడి జిల్లాలో ఆయన మాట ఎక్కడా చెల్లుబాటు కావడం లేదు. ఇక.. సొంత నియోజకవర్గం పెనుకొండలో అయితే మంత్రి సవితకు, ఎంపీకి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి. ఏ పనిలోనూ ఎంపీకి చిన్న భాగస్వామ్యం కూడా లేదు. కదిరి, హిందూపురం, ధర్మవరం, రాప్తాడు ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ పార్థసారథి మాట చెల్లుబాటు కావడం లేదని ఆయన వర్గీయులు వాపోతున్నారు.

బదిలీల్లో ఘోర పరాభవం

ఇటీవల జరిగిన బదిలీల్లో ప్రభుత్వ సిబ్బందికి ఇచ్చిన సిఫార్సు లేఖల్లో ఎంపీల సిఫార్సు లేఖలు బుట్టదాఖలయ్యాయి. నియోజకవర్గంలో తమ సిఫార్సు కాదని ఎంపీల సిఫార్సు లేఖలు తీసుకోవద్దంటూ అధికారులకు ఎమ్మెల్యేలు హుకుం జారీచేశారు. చివరకు ఎంపీ ల్యాడ్స్ కింద పనులు చేసినా తమ నియోజకవర్గంలో జరుగుతున్నాయి. కాబట్టి తమకు వాటా దక్కాల్సిందేనని పట్టుపడుతున్నారు. ఈ క్రమంలో బయటకు చెప్పుకోలేక, ఎమ్మెల్యేలను ఎదుర్కొనే శక్తి లేక ఎంపీలు లోలోపల కుమిలిపోతున్నారు. ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసినా అధిష్టానం పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో నలిగిపోతున్నారు. తమకంటే నామినేటెడ్ పోస్టులు దక్కించుకుంటున్న వారే నయమని ఎంపీలు సన్నిహితులతో వాపోతున్నారు.

'పురం'లో నిమజ్జనానికి పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

- డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంటుందని ఎస్పీ రత్న వెల్లడి



హిందూపురం: చవితి రోజున మండపాల్లో కొలువై పూజలందుకున్న వినాయకుడి గంగఒడికి చేరే అపురూపఘట్టం ఆసన్నమైంది. వినాయక చవితి ఉత్సవాలకు జిల్లాలోనే పేరుగాంచిన హిందూపురంలో గురువారం గణేశుడి నిమజ్జనం అట్టహాసంగా సాగనుంది. ఇప్పటికే అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఎస్పీ రత్న హిందూపురంలో పర్యటించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించి మీడియాతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. అడిషనల్ ఎస్పీతో పాటు ఐదుగురు డీఎస్పీలు, 33 మంది సీఐలు, 63 మంది ఎస్ఐలు, 170 మంది ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 316 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 49 మంది మహిళా పోలీసులు, 210 మంది హోం గార్డులతో పాటు 4 ఏపీఎస్పీ ప్లటూన్లు, స్పెషల్ పార్టీ పోలీసులు... ఇలా మొత్తంగా 1,000 మంది నిమజ్జనం విధుల్లో ఉంటారని ఎస్పీ తెలిపారు. నిమజ్జనం సందర్భంగా హిందూపురంలో ట్రాఫిక్ మళ్లించామని, ఈ విషయాన్ని వాహన చోదకులు, ప్రయాణికులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఉదయం 10 గంటల్లోపు శోభయాత్రకు సిద్ధంకావాలి

గురువారం ఉదయం పదిగంటలల్లోపు అన్ని మండపాల నుంచి వినాయక విగ్రహాలు శోభాయాత్రకు బయలుదేరాలన్నారు. ఇందుకు గణేష్ మండపాల నిర్వాహకులు సహకరించాలని ఎస్పీ రత్న కోరారు. నిమజ్జనం చేసే కోనేరు వద్దకు రాకుండా పిల్లలు, మహిళలను దూరంగా ఉంచాలన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా సాగేలా మతపెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు, యువత, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలన్నారు.

డిసెంబర్ 7న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

పుట్టపర్తి అర్బన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష డిసెంబర్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు శ్రీనివాసులరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థి కుటుంబ ఆదాయం రూ.3.5 లక్షల్లోపు ఉండాలన్నారు. విద్యార్థులు ఈ నెల 4వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీలోపు www.bse.ap.gov.inలో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ కార్డులో ఉన్న విధంగా విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలన్నారు. పరీక్ష ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 ఎస్‌బీఐ లింక్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రైతుకోసం వైఎస్సార్ సీపీ పోరుబాట



మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్, పార్టీ పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి

- యూరియా కొరతపై 9న ఆర్డీఓ కార్యాలయాల ఎదుట ధర్నా
- రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పిలుపు

పుట్టపర్తి అర్బన్: రైతు కోసం వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టింది. కనీసం యూరియా కూడా ఇవ్వలేని అసమర్థ కూటమి సర్కార్ పాలనను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన ధర్నాకు సిద్ధమైంది. రైతుల కోసం చేస్తున్న ఈ ఉద్యమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు, రైతు సంక్షేమాన్ని కాంక్షించే వారంతా పాల్గొనాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆమె వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డితో కలిసి పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరినప్పటి నుంచి రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. కేంద్రంలో భాగస్వాములుగా ఉన్న కూటమి నేతలు మామిడి రైతులకు కనీస మద్దతు ధర ఇప్పించలేకపోయారన్నారు. ఉల్లి రైతులకు కంట కన్నీరు పెట్టిస్తున్నారన్నారు. ఇక విత్తనాలు, ఎరువులు కూడా సకాలంలో రైతులకు అందించలేకపోయారన్నారు. అందువల్లే ఈ సీజన్‌లో జిల్లాలో కేవలం 63 శాతం మంది రైతులే పంటలు సాగు చేశారన్నారు. రైతులకు జీవనాధారమైన వరి సాగు చేయవద్దని ప్రకటించడం కూటమి ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమన్నారు. కీలకమైన సమయంలో యూరియా అందించలేని కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. పంట నష్ట పరిహారం, ఉచిత బీమా, క్రాప్ ఇన్సూరెన్స్ గత ఏడాది అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయలేకపోయిందన్నారు. ఈ నేపథ్యంలోనే రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9వ తేదీ మంగళవారం జిల్లాలోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. వైఎస్ జగన్ సర్కార్ రైతును రాజు చేస్తే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల జీవితాలను నాశనం చేస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కన్వీనర్లు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు టీచర్లకు రాష్ట్రస్థాయి అవార్డులు



జయచంద్ర
హిందీ టీచర్



మాణిక్యం ఇసాక్
తెలుగు టీచర్

పుట్టపర్తి అర్బన్: జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఏటా అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు రొద్దం మండలం కోగిర ఉన్నత పాఠశాల హిందీ టీచర్ జాబిలి చాంద్‌బాషా అలియాస్ జయచంద్ర, కొత్తచెరువు మండలం బండ్లపల్లి ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ మాణిక్యం ఇసాక్ ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీన విజయవాడలో జరిగే కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

- జయచంద్ర తాను పని చేసిన పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు విద్యాభివృద్ధికి పాటుపడ్డారు. వినూత్న పద్ధతుల్లో పిల్లలకు అర్థం అయ్యేలా బోధిస్తున్నారు. జాబిలి కలం పేరుతో కవితా రచన, జాతీయ గీతం 'జనగణమన'తో లక్ష గళార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనకు 2017లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2018లో అనంతపురం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించాయి. అలాగే సేవా రత్న, మదర్‌థెరీసా పురస్కారం తదితర 70 వరకూ రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.
- మాణిక్యం ఇసాక్‌కు బోధనలో 30 ఏళ్ల అనుభవం ఉంది. ఆయన 216 పద్యాల పుస్తకాలు ఆవిష్కరించారు. 2025లో మహమ్మద్ ఇక్బాల్ జాతీయ పురస్కారం పొందారు. పదో తరగతిలో ఏటా వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఆయన వద్ద చదువుకున్న ఎందరో విద్యార్థులు ప్రస్తుతం టీచర్లు, డాక్టర్లు, ఇంజినీర్లుగా స్థిరపడ్డారు.

29 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లాలోని 29 మండలాల పరిధిలో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకూ 233.8 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. అత్యధికంగా చిలమత్తూరు మండలంలో 28.2 మి.మీ, అమడగూరు మండలంలో 20.2 మి.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. ఇక అమరాపురం మండలంలో 15.2 మి.మీ, గోరంట్ల 14.2, అగళి 13.8, హిందూపురం 11.2, కొత్తచెరువు 10.2, లేపాక్షి 10.2, సోమందేపల్లి 9.8, పెనుకొండ 9.4, మడకశిర 9.2, రొళ్ల 9.2, గాండ్లపెంట 8.2, సీకేపల్లి 7.8, బుక్కపట్నం 6.4, నల్లమాడ 5.6, గుడిబండ 5.4, పుట్టపర్తి 4.6, పరిగి 4.2, ఎన్‌పీకుంట 3.6, తలుపుల 2.4, ఓడీచెరువు 2.4, బత్తలపల్లి 2.2, కదిరి 2.2, తనకల్లు 2.0, ధర్మవరం 1.6, నల్లచెరువు మండలంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పోరాడదాం.. విజేతలుగా నిలుద్దాం

- పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తా చాటుదాం
- కూటమి దౌర్జన్యాలు, దుర్మార్గాలను ఊరూరా వివరిద్దాం
- పార్టీ శ్రేణులకు ఉషశ్రీ చరణ్, రమేష్‌రెడ్డి పిలుపు
- పుట్టపర్తిలో వైఎస్సార్ సీపీ వర్కింగ్ కమిటీ సభ్యులతో సమావేశం





సమావేశంలో పాల్గొన్న వర్కింగ్‌ల కమిటీ సభ్యులు, ప్రసంగిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, చిత్రంలో పరిశీలకులు రమేష్‌రెడ్డి తదితరులు

పుట్టపర్తి అర్బన్: ''పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి పార్టీల నేతల దౌర్జన్యం, అరాచకం చూశాం. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వారి వైఖరి అలాగే ఉంటుంది. ఏస్థాయికైనా దిగజారి రాజకీయం చేస్తారు. వారి అరాచకాలను సమష్టిగా ఎదుర్కొందాం. గ్రామ గ్రామానా వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడిద్దాం'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, ఆ పార్టీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం పుట్టపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉషశ్రీచరణ్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి వర్కింగ్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్, రమేష్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు మరోసారి తెలియజేసి పార్టీని గ్రామ/వార్డు స్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే సమర్థవంతమైన నాయకులు వేలాది మంది ఉన్నారని, అందుకే వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించామన్నారు. తొలుత 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'లో భాగంగా 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మన పార్టీ నాయకులే ప్రజాప్రతినిధులుగా ఉన్నారని, తిరిగి మనమే అన్ని స్థానాల్లో గెలవడంతో పాటు జిల్లాలోని 7 ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్నారు.

పనిచేసే వారికి సముచిత స్థానం

పార్టీకోసం కష్టపడే వారికి తప్పక సముచిత స్థానం కల్పించడంతో పాటు అండగా ఉంటామని ఉషశ్రీ చరణ్, రమేష్‌రెడ్డి తెలిపారు. పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేయడానికి జిల్లాలో తొలి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరి సలహా, సూచనలను కమిటీ తీసుకుంటుందన్నారు. వివిధ కమిటీల్లో స్థానం దక్కించుకున్న వారంతా పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో గమనించిన ప్రతి అంశాన్ని జిల్లా కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి బూత్‌లోనూ బీఎల్‌ఏలను ఏర్పాటు చేసుకుని, ఆ జాబితాను ఆర్డీఓలకు పంపాలన్నారు. ఓటరు జాబితా, మార్పులు, చేర్పులు, పోలింగ్ బూత్‌ల మార్పు తదితర విషయాలన్నీ తెలుసుకోవాలన్నారు.

సోషల్ మీడియాను వాడుకుందాం

ప్రతి గ్రామంలోనూ మహిళా, రైతు, యువజన, సోషల్ మీడియా విభాగాలను ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ కార్యక్రమాలను, కూటమి సర్కార్ అసమర్థ పాలన, అరాచకాలను ఫేస్‌బుక్, ట్విట్టర్ తదితర సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిద్దామన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ సూచనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డీఎస్ కేశవరెడ్డి, చౌళూరు మధుమతిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు లింగాల లోకేశ్వరరెడ్డి, కురుబ నాగిరెడ్డి, శేషరెడ్డి, సుధాకరరెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ గాజుల శ్వేతారెడ్డి, వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మహిళా విభాగం రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీలారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సాయికుమార్, శివప్రసాద్, రఘురామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రణీత్‌రెడ్డి, సురేష్‌కుమార్, ప్రభాకరరెడ్డి, రామకృష్ణారెడ్డి, సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు అభిలాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్, వలంటీర్ విభాగం అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, చేనేత విభాగం అధ్యక్షుడు జింకా కంబగిరి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పురుషోత్తం, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు రాజారెడ్డి, ప్రచార విభాగం అధ్యక్షుడు ఫక్ృద్దీన్, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు రమేష్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, ఐటీ విభాగం అధ్యక్షుడు గంగిరెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు గజ్జల శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో ఓనం వైభవం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న బాలవికాస్ చిన్నారులు



ప్రసంగిస్తున్న ఎంపీ ప్రేమచంద్రన్

ప్రశాంతి నిలయం: కేరళీయుల పవిత్రంగా ఆచరించే ఓనం వేడుకలు బుధవారం ప్రశాంతి నిలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలను పురస్కరించుకుని సాయికుల్వంత్ సభా మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత కేరళ సంప్రదాయ రీతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లం ఎంపీ ఎన్‌కె.ప్రేమ చంద్రన్ ప్రసంగిస్తూ.. ఓనం పర్వదిన విశిష్టతను, సత్యసాయి నిస్వార్థ సేవలను వివరించారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. అనంతరం శ్రీశైలానికి చెందిన శ్రీసత్యసాయి విద్యాపీఠం విద్యార్థులు ''ది పాథ్ ఆఫ్ ట్రూ డివోషన్''పేరుతో నృత్యరూపకం ప్రదర్శించారు. శబరి భక్తి ప్రపత్తులను వివరిస్తూ అద్భుతంగా ఆడిపాడారు.



'ది పాథ్ ఆఫ్ ట్రూ డివోషన్' నృత్యరూపకంలోని ఓ ఘట్టం

క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్

పెనుకొండ రూరల్: రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉష శ్రీచరణ్ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఎస్పీ పదోన్నతులపై చోటు చేసుకున్న అక్రమాలపై ఆధారాలతో సహా 'సాక్షి' పత్రికలో కథనం ప్రచురిస్తే.. కక్ష కట్టి విజయవాడలోని 'సాక్షి' కార్యాలయంపై దాడి చేయించడంతో పాటు ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించిన ప్రభుత్వ తీరును ఆమె ఖండించారు. నిజాలను నిర్భయంగా రాసే పాత్రికేయులను అక్రమ కేసులతో కట్టడి చేయాలనుకోవడం మూర్ఖత్వమని వ్యాఖ్యానించారు.

భూసంరక్షణా విభాగం ఈఈగా పోలప్ప



పోలప్పకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉన్న భూసంరక్షణా విభాగం (సాయిల్ కన్సర్వేషన్) ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఈఈ)గా పోలప్ప బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ఆ స్థానంలో ఇప్పటి వరకూ ఇన్‌చార్జి ఈఈగా ఉన్న ఓబుళపతి బాధ్యతలు అప్పజెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో డీఈగా ఉన్న పోలప్పకు ఈఈగా పదోన్నతి కల్పించి జిల్లాకు బదిలీ చేశారు. అలాగే డీఈ హోదాలో ఉన్న ఇన్‌చార్జి ఈఈ ఓబుళపతికి సైతం ఈఈగా పదోన్నతి కల్పించి ఒంగోలుకు బదిలీ చేశారు. అయితే ఓబుళపతి డెప్యుటేషన్ కింద ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్‌గా కొనసాగనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఇరువురూ ఈఈలకు ఆ శాఖ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

11, 12న జిల్లా స్థాయి కళా ఉత్సవ్

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నంలోని డైట్ కళాశాల వేదికగా ఈ నెల 11, 12 తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులకు సంస్కృతి, కళలపై జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు–2025 నిర్వహించనున్నారు. ఈ మేరకు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిభ చాటిన వారిని ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. పూర్తి వివరాలకు 99499 93712, 79817 76864లో సంప్రదించవచ్చు.

బెంగళూరులో మృతి.. 'పురం'లో సర్టిఫికెట్

- జనన, మరణాల ధ్రువీకరణ పత్రాల జారీలో హిందూపురం మున్సిపల్ అధికారుల చేతివాటం
- టీడీపీ నేతల కనుసన్నల్లో ఇష్టారీతిన డెత్, బర్త్ సర్టిఫికెట్ల జారీ

చిలమత్తూరు: జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో హిందూపురం మున్సిపల్ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దేశంలో ఎక్కడ మరణించినా.. ఎక్కడ జన్మించినా.. స్థానిక మున్సిపల్ అధికారులు కోరిన మొత్తాన్ని ముట్టజెపితే నిమిషాల వ్యవధిలో దొంగ సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. వాస్తవానికి జనన, మరణాలు చోటు చేసుకున్న ప్రాంతంలోనే ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంది. అయితే నిబంధనలు అతిక్రమిస్తూ హిందూపురం మున్సిపల్ అధికారులు జారీ చేస్తున్న ధ్రువీకరణ పత్రాలు.. వాటిని పొందిన వారికి భవిష్యత్తులో చుక్కలు చూపడం గ్యారంటీ అని కొందరు మున్సిపల్ అధికారులు హెచ్చరిస్తున్నారు.



బెంగళూరులోని ఆస్పత్రి నిర్వాహకులు అందజేసిన మరణ ధ్రువీకరణ పత్రం



హిందూపురంలోనే మృతి చెందినట్లుగా దరఖాస్తు చేయించిన పత్రం

అంతా మా ఇష్టం..

హిందూపురంలోని కంసాల పేటలకు చెందిన వి.శంకరాచారి (84) ఈ ఏడాది జూలై 3న బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనికి సంబంధించి సదరు ఆస్పత్రి యాజమాన్యం డెత్ సర్టిఫికెట్‌ను అందజేసింది. దీని ఆధారంగా బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) డెత్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తుంది. అయితే స్థానిక టీడీపీ నేత జోక్యం చేసుకుని డెత్ సర్టిఫికెట్‌ను హిందూపురం మున్సిపాల్టీ ద్వారానే అందజేయిస్తానని నమ్మబలకడంతో మృతుడి కుటుంబీకులు జూల్ 17న దరఖాస్తు చేసుకున్నారు. దీని ఆధారంగా డెత్ సర్టిఫికెట్‌ను మున్సిపల్ అధికారులు అందజేశారు. వయోభారంతో ఇంటి వద్దనే శంకరాచారి మృతి చెందినట్లుగా తప్పుడు రికార్డులు సృష్టించి ధ్రువీకరణ పత్రం జారీ చేయడం వివాదాస్పదమైంది. ఈ అక్రమాల్లో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. మున్సిపల్ కమిషనర్ సంతకాలతోనే ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయడం కలకలం రేపింది. ఇలాంటివి లెక్కకు మించి దొంగ సర్టిఫికెట్లు జారీ చేసినట్లుగా తెలుస్తోంది. ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను 'సాక్షి' వివరణ కోరగా.. ఈ అంశం తన దృష్టిలో లేదని, అలాంటివి మంజూరు చేయడం నేరమవుతుందని అన్నారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ముడుపులు దండుకుని..

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను పొందాలంటే అంత సులువు కాదు. అయితే హిందూపురం మున్సిపాల్టీలో కేవలం నిమిషాల వ్యవధిలోనే జనన, ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తుండడం గమనార్హం. స్థానిక టీడీపీ నేతల సిఫారసు తీసుకెళితే చాలు.. ముందు వెనుక ఆలోచించకుండా సర్టిఫికెట్లను జారీ చేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ ప్రక్రియలో అధికారులు పెద్ద మొత్తంలో ముడుపులు దండుకుంటున్నట్లు సమాచారం. శంకరాచారి మరణ ధ్రువీకరణ పత్రం జారీ అంశంలోనూ హిందూపురం పట్టణానికి చెందిన ఓ టీడీపీ ముఖ్య నేత పాత్ర ఉన్నట్లుగా ఆరోపణలున్నాయి. స్థిరాస్తి విషయంలో మరణ ధ్రువీకరణ పత్రం అవసరంకావడంతో సదరు టీడీపీ నేత తన పలుకుబడిని ఉపయోగించి దొంగ సర్టిఫికెట్ చేయించి ఇచ్చినట్లుగా తెలిసింది.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకూ పోరాటం

- ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతినాయుడు

అనంతపురం రూరల్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం దగా చేసిందని ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతినాయుడు మండిపడ్డారు. డిమాండ్ సాధనలో భాగంగా బుధవారం ఏపీ వాల్మీకి, బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవయ్య ఆధ్వర్యంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసుల ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. రుద్రంపేటలోని వాల్మీకి భవన్ నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులను పోలీసులు అడ్డుకుని నాల్గో పట్టణ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా క్రాంతినాయుడు మాట్లాడారు. ఎన్ని



ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

అడ్డంకులు సృష్టించినా వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చే వరకూ తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నరేష్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు మేకల శివ, నాగేంద్ర, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గుమ్మనూరుపై చర్యలు తీసుకోవాలి

ధర్మవరం: ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులతో దురుసుగా మాట్లాడిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ధర్మవరంలో వారు విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లు నియోజకవర్గం గుత్తి, పామిడి మండలాల్లోని ఐదు గ్రామాల్లో సోలార్ విండ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు లీజు పద్ధతిలో కాకుండా దళారులతో దౌర్జన్యంగా భూ సేకరణను టీడీపీ నేతలు చేపట్టారన్నారు. విషయం తెలుసుకున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, మండల నాయకులు, రైతులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంటే ఎమ్మెల్యే జయరాం ఫోన్ చేసి అవమానకర రీతిలో దూషిస్తూ.. బెదిరింపులకు దిగడం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యేపై ప్రభుత్వం చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

తీసుకోకపోతే ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ నాయకులు జీవీ రమణ, అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ, హైదర్‌వలి, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మారుతి, వెంకటస్వామి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జన్‌ధన్ ఖాతాలకు కేవైసీ చేయించుకోండి

- ఆర్‌బీఐ ఎఫ్‌ఐ విభాగం జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ మహనా

లేపాక్షి: కేంద్ర ప్రభుత్వం పదేళ్ల క్రితం ప్రారంభించిన జన్‌ధన్ పథకానికి సంబంధించి బ్యాంక్ ఖాతాలు తెరిచిన వారు మరో సారి కేవైసీ చేయించుకోవాలని, లేకపోతే ఆ ఖాతాలు రద్దు అయ్యే అవకాశముందని ఆర్‌బీఐ ఎఫ్‌ఐ విభాగం జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ మహనా పేర్కొన్నారు. లేపాక్షి మండలం చోళసముద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణా బ్యాంక్ ఆధ్వర్యంలో, లేపాక్షిలోని అన్నదాన సత్రంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా జనసురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఇందులో భాగంగానే ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలు అమలులోకి వచ్చా



చోళసముద్రంలో మాట్లాడుతున్న రాజేష్‌కుమార్ మహనా

యన్నారు. ఆయా పథకాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎల్‌డీఓ రోహిత్ అగర్వాల్, ఎల్‌డీఎం రమణకుమార్, జోనల్ హెడ్ శ్రీనివాసకుమార్, రీజనల్ ఎల్‌డీఎంలు రమణ కుమార్, జితేంద్ర కుమార్ మిశ్రా, రమేష్, బ్రాంచ్ మేనేజర్లు విజయబాబు, జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మాజీ మావోయిస్టుల సమస్యలు పరిష్కరించండి

పుట్టపర్తి అర్బన్: స్థానిక మాజీ మావోయిస్టుల కాలనీలో ఇంటి స్థలాలను ఇతరులకు కేటాయించకుండా చూడాలని ఆర్డీఓ సువర్ణకు ధరణి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారాం విన్నవించారు. సమస్య పరిష్కారం కోరుతూ బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం వినతి పత్రం అందజేసి సొసైటీ అధ్యక్షుడు రాజారాం, బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లాయర్ హరి మాట్లాడారు. పుట్టపర్తి సమీపంలోని కప్పలబండ రెవెన్యూ పరిధిలో ధరణి సొసైటీ సభ్యులకు ఇళ్ల పట్టాలు అందజేసేందుకు 4.5 ఎకరాలను కేటాయించారని గుర్తు చేశారు. ఇందులో సొసైటీలో సభ్యులు కాని వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, నిర్మాణాలు చేపట్టేలా అదే గ్రామానికి చెందిన లోచర్ల విజయభాస్కరరెడ్డి ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ అంశంలో స్థానిక ఎమ్మెల్యే జోక్యం



ఆర్డీఓ సువర్ణకు వినతి పత్రం ఇస్తున్న మాజీ మావోయిస్టులు

చేసుకుని అధికారులకు సిఫారసు చేశారని, ఇది నిజమని తేలితే ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు హనుమన్న, బొంతలపల్లి శ్రీరాములు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలే ముఖ్యం

- డాట్ సెంటర్ శాస్త్రవేత్త రామసుబ్బయ్య



మాట్లాడుతున్న సైంటిస్ట్ రామసుబ్బయ్య

తలుపుల: పంటల సాగుతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని రైతులకు అనంతపురం డాట్ సెంటర్ శాస్త్రవేత్త కె.రామసుబ్బయ్య సూచించారు. ఏడీఏ శైలకుమారి, ఏఓ నాగ మధుసూదన్ ఆధ్వర్యంలో తలుపుల మండలం గొల్లపల్లితండాలో బుధవారం ఏర్పాటు చేసిన రైత శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత రైతులు ఎక్కువగా వేరుశనగ, టమాట తదితర పంటలు సాగు చేస్తున్నందున ఆయా పంటలలో సస్యరక్షణ చర్యలు, పంట సాగు విధానాలను వివరించారు. పకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, వీఐఏ సుధాకర్, సీఎస్‌పీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జిల్లాకు 1,923 మెట్రిక్ టన్నుల ఎరువులు



జిల్లాకు చేరిన యూరియాను పరిశీలిస్తున్న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం అగ్రికల్చర్: స్పిక్ కంపెనీ నుంచి 1,922.75 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు సరఫరా కాగా, ఇందులో 904.5 మెట్రిక్ టన్నుల యూరియా ఉన్నట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు బుధవారం వ్యాగన్ల ద్వారా చేరిన ఎరువులు, యూరియాను పరిశీలించారు. 904.5 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు 507.85 మెట్రిక్ టన్నుల డీఏపీ, 255.2 మెట్రిక్ టన్నుల 20-20-0-13, 255.2 మెట్రిక్ టన్నుల 10-26-26 రకం కాంప్లెక్స్ ఎరువులు చేరాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు యూరియాకు సంబంధించి కోటా మేరకు 399.915 మెట్రిక్ టన్నులు అనంతపురం మార్క్‌ఫెడ్‌కు, 200.655 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు కేటాయించగా... 303.93 మెట్రిక్ టన్నులు శ్రీసత్యసాయి జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. కాంప్లెక్స్, డీఏపీలు 90 శాతం మేర ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు 10 శాతం మార్క్‌ఫెడ్‌కు కేటాయించినట్లు వివరించారు.

జింక పిల్ల స్వాధీనం



సాంబశివుడు నుంచి జింక పిల్లను స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు కొట్టాల గ్రామంలో బోయ సాంబ శివుడు వద్ద ఉన్న జింక పిల్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు బత్తలపల్లి పోలీసులు, ఫారెస్ట్ అధికారులు బుధవారం ఆ గ్రామానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో ఉన్న జింక పిల్లతో పాటు సాంబశివుడిని పుట్టపర్తిలోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశులు, కానిస్టేబుల్ అనిల్‌కుమార్, అటవీ శాఖ బీట్ ఆఫీసర్ అక్కులప్ప పాల్గొన్నారు.

మహిళపై దాడి... 9 మందిపై కేసు నమోదు

ధర్మవరం రూరల్: స్థానిక శాంతినగర్‌లో నివాసముంటున్న మహిళపై దాడికి పాల్పడిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. శాంతినగర్‌లో నివాసముంటున్న దాసరి రామ్మోహన్ బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేస్తూ వారానికి ఒకసారి వచ్చి వెళ్లేవాడు. ఆయన భార్య సులోచన చీరల వ్యాపారం చేస్తోంది. ఇదే కాలనీలో వినాయక మంటపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో ఆంజనేయులు అనే వ్యక్తి దక్కించుకున్నాడు. ఆ సమయంలో ఆంజనేయులు, రాజు మధ్య మనస్పర్థలు చెలరేగి మంగళవారం గొడవ పడ్డారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న సులోచనను చూపిస్తూ అదే ప్రాంతానికి చెందిన సుధ దుర్భాషలకు దిగింది. సులోచన కాలనీలోకి వచ్చినప్పటి నుంచి ఇలాంటి పోకడలను ప్రోత్సహిస్తోందంటూ దూషించింది. దీంతో తానేమన్నానని సులోచన ప్రశ్నించడంతో సుధ, రాధ, రవి, లక్ష్మి, సంధ్య, లక్ష్మి, రాజగోపాలరెడ్డి, చిన్నా, బన్నీ ఆగ్రహంతో రెచ్చిపోయి దాడి చేసి గాయపరిచారు. చుట్టుపక్కల ఉన్నవారు జోక్యం చేసుకుని సర్దిచెపి, గాయపడిన సులోచనను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి

గుడిబండ: మండలంలోని చిగతుర్పిలో చిరుత దాడిలో ఓ లేగ దూడ మృతి చెందింది. పాడి పోషణతో జీవనం సాగిస్తున్న ఆ గ్రామానికి చెందిన రైతు ఈరక్యాతప్ప మంగళవారం రాత్రి పాడి పశువులను తన పొలం వద్ద దొడ్డిలో వదిలి ఇంటికెళ్లాడు. బుధవారం ఉదయం వెళ్లి చూసేసరికి లేగ దూడ మృతి చెంది కనిపించింది. మెడపై చిరుత పంటి గాట్లను గుర్తించి సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చాంప్లానాయక్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. వన్యప్రాణులతో నష్టం వాటిల్లితే బాధిత రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని పేర్కొన్నారు.



చిరుత దాడిలో మృతి చెందిన దూడ

ఆటో బోల్తా - వివాహిత మృతి

శింగనమల(నార్పల): ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి (40)కి భర్త, పిల్లలు ఉన్నారు. నార్పల మండలం గుంజేపల్లిలో సమీప బంధువుల మంచిమాట కార్యక్రమానికి బుధవారం వచ్చిన ఆమె ఆ తర్వాత నార్పలలో ముహూర్తం కట్టుకునేందుకు వెళ్లారు. ఈ ప్రక్రియ ముగియగానే ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. నార్పల మండలం నీలితోటపల్లి వద్ద ఆటో బోల్తా పడడంతో లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. మరో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతురాలు లక్ష్మీదేవి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నల్లమాడ: మండలంలోని పులగంపల్లికి చెందిన వి.భాస్కర్ (40) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుధవారం ఇనుప నిచ్చెనను భుజంపై మోసుకు వెళుతుండగా ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి తండ్రి తిరుపాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎలుగుబంట్ల దాడిలో కాపరికి తీవ్ర గాయాలు



రంగధామప్ప

రొళ్ల: మేక పిల్లల కోసం మేత కోస్తుండగా హఠాత్తుగా రెండు ఎలుగుబంట్లు దాడి చేయడంతో రంగధామప్ప అనే కాపరి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బుధవారం శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని టీడీ పల్లి ఎస్సీ కాలనీకి చెందిన రంగధామప్ప మేక పిల్లల మేత కోసం గ్రామ పొలిమేర వద్దకు వెళ్లి గడ్డి కోసే పనిలో నిమగ్నమయ్యాడు. పక్కనే ఉన్న అటవీ ప్రాంతం నుంచి రెండు పెద్ద ఎలుగుబంట్లు హఠాత్తుగా వచ్చి దాడి చేశాయి. తప్పించుకోవడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యపడలేదు. వెంబడించి మరీ దాడి చేశాయి. ఎడమ చేయి, భుజం, కుడికాలు తొడ కింద భాగాన తీవ్రంగా రక్కి గాయపరిచాయి. ఎలాగోలా తప్పించుకుని తీవ్ర గాయాలతో ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే రొళ్ల సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

అనుమానాస్పద మృతి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కామక్కపల్లి అటవీ ప్రాంతంలో రామగిరి మండలం పేరూరు గ్రామానికి చెందిన తిమ్మక్క (67) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బుధవారం ఆటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం

గోరంట్ల: మండలంలోని బూచేపల్లికి చెందిన శివశంకర్ (40) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. గ్రామ సమీపంలోని తన పొలంలో బుధవారం చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కర్ణాటక బస్సు



పొలంలో ఆగిన బస్సు

మడకశిర: కర్ణాటకకు చెందిన ఓ ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిల్ అయి పొలాల్లోకి దూసుకెళ్లింది. బుధవారం మధ్యాహ్నం పావగడ నుంచి 30 మంది ప్రయాణికులతో బెంగళూరుకు బస్సు బయల్దేరింది. మడకశిర సమీపంలోకి చేరుకోగానే బ్రేక్ ఫెయిల్ అయినట్లుగా డ్రైవర్ గుర్తించి చాకచక్యంగా వ్యవహరిస్తూ పొలాల్లోకి తిప్పాడు. పొలాల్లో బస్సు కొంత దూరం వెళ్లి ఆగిపోయింది. ఎవరూ గాయపడలేదు. ఈ సందర్భంగా డ్రైవర్‌ను పలువురు అభినందించారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

ముదిగుబ్బ: మండలంలోని బ్రహ్మదేవరమర్రి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు రోజారాణిని సస్పెండ్ చేస్తూ డీఈఓ క్రిష్టప్ప బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులను నోటికొచ్చినట్లు తిట్టడమే కాకుండా, విధులకు సక్రమంగా హాజరు కావడం లేదంటూ ఇటీవల డీఈఓకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణకు డీఈఓ ఆదేశించారు. విచారణాధికారి అందజేసిన నివేదిక ఆధారంగా ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ రమణప్ప తెలిపారు.